క్లుప్తంగా

కలెక్టర్‌కు ఫిర్యాదు

అర్వపల్లి : బొల్లంపల్లి గ్రామ ఐకేపీ కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల నందు అవకతవకలు జరిగాయని శుక్రవారం గ్రామ రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవకతవకలపై వెంటనే విచారణ జరిపించి బాధ్యులపై చర్య తీసుకోవాలని కోరారు.

విశ్వకర్మ నిధులు మంజూరు చేయాలని వినతి



బూర నర్సయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న విశ్వకర్మ దరఖాస్తుదారులు

నాగారం : పీఎం విశ్వకర్మ యోజన దరఖాస్తుదారులకు పథకాన్ని వర్తింపజేసి నిధులు మంజూరు చేయాలని ఫణిగిరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నాగువెంకన్నసరిత శుక్రవారం హైదరాబాద్‌లో పీఎం విశ్వకర్మ యోజన రాష్ట్ర కోఆర్డినేటర్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనతోపాటు అనంతుల సోమేష్‌గౌడ్ ఉన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 9న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రైతుకూలీ పోరాట సమితి నాయకులు బత్తుల గురువన్న, జుజ్జూరు సత్యం కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రైతుకూలీ పోరాట సమితి ఆధ్వర్యంలో సదస్సు విజయవంతానికై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. పత్తి, వరి తదితర ధాన్యాలు పండించిన రైతులను గ్రామాల్లో దళారీలు మోసం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మెట్టు పుల్లారెడ్డి, బెల్లి నాగరాజు, సామ శ్రీనివాస్‌రెడ్డి, సాయి, లింగయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రణపంగ కృష్ణ

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం అందించాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై డిసెంబర్ 3న ఛలో ఢిల్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీలకంఠం సరస్వతి, జూకూరి భద్రమ్మ, షేక్ అమ్మని, మానస, దాసరి కోటయ్య, సన్నాయిల స్వాతి, సరిత, మలయావతి, ఆదెమ్మ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు పంపిణీ చేస్తున్న నాయకులు

నాగారం : సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య అన్నారు. నాగారం గ్రామానికి చెందిన ఎలుక కృపాకర్‌కు ఇటీవల మోకాలి శస్త్ర చికిత్సకాగా ఆయనకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సిఫారసు ద్వారా రూ.35,000 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును శుక్రవారం మండల కేంద్రంలో లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అనంతుల వెంకటయ్య, ఎలుక సుందరయ్య, జాజుల సావిత్ర, జాజుల యోహాను, కన్నెబోయిన భిక్షం, ఎలుక శ్రీను, అక్కినపల్లి వెంకన్న, పేరం సత్తయ్య, ఎలుక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

అర్వపల్లి: తిమ్మాపురంలోని పీఏసీఎస్‌లో వివిధ రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చైర్‌పర్సన్ మారిపెద్ది మంగమ్మ, సీఈఓ ఊర సత్యనారాయణ తెలిపారు. ఎంటీయూ 1010 రకం, కేఎన్ఎం 118, ఎంటీయూ 1290, జేజీఎల్ 24423 రకం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులు తీసుకెళ్లాలని కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి



ఆత్మకూర్ (ఎస్) : మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు



తుంగతుర్తి : బాలుర గురుకుల పాఠశాలలో..

ఆత్మకూర్(ఎస్) : పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ హసీం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా, మోడల్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ వినోద్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు, పరిశుభ్రమైన కూరగాయలు తెచ్చి వడ్డించాలని అన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుళ్లిపోయిన, పురుగులు ఉన్న కూరగాయలు పెట్టవద్దని అన్నారు. బియ్యాన్ని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఒకటికి రెండుసార్లు కడిగి వండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ దయానందం అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం పాఠశాలల్లోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బోయిని లింగయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి కేజీబీవీలో బాలికలతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

చివ్వెంల : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి భావిపౌరులుగా ఎదగాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్ సంతోష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మినీగురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మేనూ ప్రకారం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ దయాకర్, పంచాయతీ కార్యదర్శి విక్రమ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

అర్వపల్లి : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి కోరారు. శుక్రవారం అర్వపల్లిలోని కేజీబీవీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, వంటలను పరిశీలించారు. బాలికలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ పాటించాలని నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్ఓ ఆర్.విజయశ్రీ, సీఆర్‌టీలు స్వప్న మేరి, ఇందిరజ్యోతి, రేణుక, విజయ, స్వాతి, మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని తహసీల్దార్ లాలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందుతున్న తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. స్టోరూమ్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అదే విధంగా ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఎంపీఓ సంజీవయ్య పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నకిరేకంటి రవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : మినీ గురుకుల పాఠశాలలో..



పెన్‌పహాడ్ : జెడ్పీహెచ్ఎస్‌లో..



మద్దిరాల ప్రభుత్వ పాఠశాలలో..

సీపీఎం మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

పెన్‌పహాడ్ : ఈ నెల 29, 30, డిసెంబర్ 1న సూర్యాపేట పట్టణంలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వీరబోయిన రవి అన్నారు. శుక్రవారం దోసపహాడ్ గ్రామంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కొండేటి రాములు, సీనియర్ నాయకులు గోగుల సోమయ్య, కృష్ణయ్య, నాగరాజు, సైదులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : సూర్యాపేటలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న జరిగే సీపీఎం తృతీయ మూడో మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు కోరారు. ఇంటింటా సీపీఎం ప్రచారంలో భాగంగా శుక్రవారం అన్నారంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ మహాసభలకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, పాలబిందెల జానయ్య, వెంకటరత్నం, బాలయ్య, యాదగిరి, సామేల్, భిక్షం, రమేష్ పాల్గొన్నారు.

నూతనకల్ : జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో నిర్వహించే సీపీఎం మూడో జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం చిల్పకుంట్లలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సామ వెంకట్‌రెడ్డి, తొట్ల లింగయ్య, కూసు సైదులు, తొట్ల అచ్చయ్య, ఉప్పుల కిరణ్, ఎర్ర ఉప్పల్‌రెడ్డి, ఇరుగు శ్రీను, సామ శ్యామ్, కూసు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన



రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

మద్దిరాల : మండల కేంద్రంలోని ఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ అమీన్‌సింగ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని ఆరబెట్టడంపై రైతులకు అవగాహన కల్పించారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కాంటాలు వేసి మల్లులకు తరలించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మైసయ్య, సీసీ నాగార్జున్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కరువైన వసతులు.. కొరవడిన రక్షణ



పెన్‌పహాడ్ : అనంతారం కొనుగోలు కేంద్రంలో చీకట్లో రక్షణ లేకుండా ఉన్న ధాన్యం రాశులు



చిల్పకుంట్లలోని కొనుగోలు కేంద్రంలో రాత్రి వేళలో ధాన్యాన్ని తూర్పార పడుతున్న రైతు

పెన్‌పహాడ్ : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు విరివిగా ధాన్యాన్ని తీసుకొస్తున్నారు. అయితే రాత్రి వేళల్లో ధాన్యాన్ని కాపాడాల్సిన కాపలాదారులను నిర్వాహకులు నియమించకపోవడంతో రక్షణ కరువైందని రైతులు వాపోతున్నారు. శుక్రవారం రాత్రి సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన విజిట్‌లో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. అనంతారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కాపలాదారుడు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో రాత్రివేళల్లో ధాన్యం అపహరణకు గురైన సంఘటనలు ఉన్నాయి. దీనికి తోడు కొనుగోలు కేంద్రంలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో చీకట్లో రాశుల వద్దకు ఎవరు వస్తున్నారో తెలుసుకోవడం కష్టంగా ఉందని రైతులు తెలుపుతున్నారు.

వసతులు కరువు..

నూతనకల్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యాన్ని తూర్పార పట్టడం కోసం ప్యాడీ క్లీనర్‌లను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ప్రయివేట్ ట్రాక్టర్లను ఆశ్రయించి గంటకు రూ.1500 చెల్లించి వడ్లను తూర్పార పట్టాల్సిన పరిస్థితి నెలకొంది. చిల్పకుంట్ల పీఏసీఎస్ కేంద్రంలో రైతులు రాత్రి వేళల్లో ట్రాక్టర్ వెలుతురులో ధాన్యాన్ని తూర్పార పడుతున్నారు. మండలంలో ఏర్పాటు చేసిన 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు సరైన విద్యుత్ వెలుగులు లేక చీకట్లోనే ఉంటున్నాయి.

సర్వే డేటా ఎంట్రీ ప్రారంభం

అర్వపల్లి : గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను శుక్రవారం ప్రారంభించారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు సెంటర్లలో 16 మంది కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా డేటా ఎంట్రీ చేస్తున్నారు. మొదటి రోజు సీఓ, ఎన్యుమరేటర్ ఇద్దరు కలిసి ఎంట్రీ చేసే పనులను చేపట్టారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 9,900 ఇళ్ల సర్వే చేపట్టగా వాటిని ఆన్‌లైన్ చేసే పని నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఎంపీఎస్ఓ సైదిరెడ్డి, గిర్దావర్లు వెంకట్‌రెడ్డి, ప్రసన్న డేటా ఎంట్రీ పనులను పర్యవేక్షిస్తున్నారు.

బంతి తోటలో విషపు ఎరలపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

పెన్‌పహాడ్ : మల్లారెడ్డి విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ సైన్సెస్ విద్యార్థులు శుక్రవారం మండల పరిధిలోని దూపహాడ్ గ్రామంలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. బంతి తోటలో విషపు ఎరలపై రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని నవీన్ అనే రైతుకు చెందిన బంతి తోటలో లేపిడోప్టరెన్ జాతికి చెందిన లద్దె పురుగులకు విషపు ఎరల ఏర్పాటుపై ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడారు. ఒక కిలో బెల్లం పానకం, ఒక లీటరు మోనోక్రోటోపాస్, ఐదు కిలోల తవుడు కలిపి ఉండలుగా చేయాలని, వాటిని అక్కడక్కడ అమర్చాలని అన్నారు. దీని వల్ల లద్దె పురుగులు ఉండలను తిని చనిపోతాయని తెలిపారు. ఈ మిశ్రమాన్ని సాయంత్రం సమయంలో వేయాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సీహెచ్ ఐశ్వర్య, అక్షయ, అక్షిత, అమూల్య, భావన, భవాని, భవ్య, దీక్షిత, దీప్తిప్రియ పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కావాలి

నాగారం : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఈ నెల 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 01-01-2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు కోసం ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పిల్లలమర్రి ఆలయంలో శాంతి కల్యాణం



పిల్లలమర్రిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట : కార్తీక మాసం సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం శాంతి కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పుష్పాలంకరణ జరిపారు. శ్రీ లక్ష్మీసమేత చెన్నకేశవ స్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు, మరింగంటి వరదాచార్యులు శాంతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ గూకంటి రాజాబాబు రెడ్డి, స్వరూప, వెంకటేశ్వర్లు, ధనలక్ష్మి, చింత సైదులు, ఎర్రమ్మ, భక్తులు ముడుంబై సారిక, రంగమణి, గవ్వ విజయలక్ష్మి, దేవరశెట్టి సంధ్య, పద్మ, జయమ్మ, అహల్య, సువర్ణ, శ్రీదేవి, అంకం భిక్షం, మల్లీశ్వరి, తూటిపల్లి జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎంవీ డ్రైవర్స్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభించి జెండా ఆవిష్కరిస్తున్న సర్వోత్తమ్ రెడ్డి, తదితరులు

భానుపురి : క్యాబ్ డ్రైవర్లు కలసి కట్టుగా ఉండి ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించుకోవాలని ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఐఎన్‌టీయూసీ అనుబంధంగా ఏర్పాటు చేసిన సూర్యాపేట లైట్ మోటార్ వెహికిల్(ఎల్ఎంవీ) డ్రైవర్స్ యూనియన్ కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. అన్ని రకాల వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని డ్రైవర్లకు సూచించారు. పేద, బడుగు, బలహీన వర్గాలైన డ్రైవర్లకు ప్రభుత్వ పథకాలు, ఇందిరమ్మ ఇళ్లలో అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కెక్కిరేణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజద్ అలీ, జంగం మహేష్, కాసాని పాపయ్య, ప్రవీణ్, ఉపేందర్, ముజీబ్ భాయ్, షారూఖ్, ప్రదీప్ పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్

సూర్యాపేట : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మండల విద్యాధికారి శేషగాని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని గాంధీనగర్ సమీపంలోని సేయింట్ గ్జేవియర్ లయోలా పాఠశాలలో స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో చదువులు, ర్యాంకులు తప్ప విద్యార్థుల మానసిక ఒత్తిడిని ఎవరూ గుర్తించడం లేదని తెలిపారు. లయోలా పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలను నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎంఈఓ శ్రీనివాస్‌ను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లూయిస్ దాస్, ప్రిన్సిపాల్ సునీల్, ఉపాధ్యాయులు రమణ, మన్మోహన్, ఉపేందర్, శ్రీను, లక్ష్మణ్, సుధీర్, ప్రవీణ్, జ్యోతి, అరుణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాతా



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

అర్వపల్లి : ప్రభుత్వ ఆరు గ్యారంటీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి కోరారు. ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో శుక్రవారం అర్వపల్లి, కాసర్లపహాడ్ తదితర గ్రామాల్లో కళాకారులు కళా ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఆర్. జలెంధర్‌రావు, దేవస్థాన మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు, హెచ్‌సీలు పిట్టల రవి, సారథి కళాకారుల జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు, ఈర్ల సైదులు, కె.నాగరాజు, ఎం.శంకర్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి రేణుక, పాల్గొన్న నాయకులు

చివ్వెంల : కుడకుడ గ్రామ శివారులో సర్వే నంబర్ 126లోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని ఉంటున్న పేదలందరికీ ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక అన్నారు. శుక్రవారం గ్రామంలోని లెనిన్ నగర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ గుడిసెల వద్దకు వచ్చి పేదలను ఖాళీ చేయాలని హెచ్చరించారన్నారు. గత ఆరేళ్లుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నామని, తమకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలను కలిసి సమస్యను వివరిస్తే అందరికీ పట్టాలు ఇస్తామని తెలిపారని అన్నారు. కలెక్టర్‌కు ఫోన్ ద్వారా చెప్పారని, సానుకూలంగా స్పందించిన ఆయన విచారణ జరుపుతామని హామీ ఇచ్చారని తెలిపారు. మంత్రులు, కలెక్టర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్ర అఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య, మారసాని చంద్రకళ, గులాం హుస్సేన్, రేణుక, సంతోషి, జయమ్మ, మోహన్, శంకర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

● హైవేపై ధాన్యం.. పొంచి ఉన్న ప్రమాదం



అర్వపల్లి : సీతారాంపురం వద్ద హైవేపై ఉన్న ధాన్యం రాశులు



అర్వపల్లి సమీపంలో హైవేపై ఆరబోసిన ధాన్యం

నూతన కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందజేస్తున్న యాకూబ్

నూతనకల్ : డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ గంటా యాకూబ్ కోరారు. శుక్రవారం అల్లునూరులో మాల మహానాడు సంఘం సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూల తీర్పు ఇవ్వడం సరైంది కాదన్నారు. రివ్యూ పిటిషన్‌ను వేయనున్నట్లు తెలిపారు. అనంతరం మాల మహానాడు గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పట్టేటి కుశలయ్య, అధ్యక్షుడిగా గోరెట్ల శ్రీను, కార్యదర్శిగా నామ వెంకటరత్నం, ప్రధాన కార్యదర్శిగా గోరెట్ల వెంకన్నను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ కన్వీనర్ చింతపల్లి శేఖర్, గంటా సందీప్, పట్టేటి లక్ష్మయ్య, పట్టేటి యాదగిరి, బోయిళ్ల వెంకటయ్య, పట్టేటి లక్ష్మీకాంతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

చిలుకూరు : ప్రతిఒక్కరికీ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలపై అవగాహన అవసరమని ఎస్ఐ సురభి రాంబాబు అన్నారు. శుక్రవారం చిలుకూరు మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణ, షీటీంపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు పెట్టవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెచ్ఎం లక్ష్మమ్మ, కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.